ప్రజాశక్తి
బుధవారం 1 ఫిబ్రవరి 2023
5
అల్లూరి సీతారామరాజు



అంధకారంలో దుంబ్రిగుడ

ప్రజాశక్తి-దుంబ్రిగూడ:స్థానిక మండల కేంద్రమైన దుంబ్రిగూడలో వీధి దీపాలు మరమ్మతులకు గురవడంతో సుమారు గత రెండు వారాల నుంచి అంధకారంలో ఉంది. చీకటి పడిన తర్వాత చిమ్మ చీకటిగా ఉంటుండడంతో స్థానికులతో పాటు మండల కేంద్రం వచ్చిన వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మరమ్మతులకు గురైన వెంటనే వీధి దీపాలను పునరుద్ధరించాల్సి ఉండగా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో మండల కేంద్రం చిమ్మ చీకటిగా ఉంటుంది. వీధి దీపాలను పునరుద్ధరించాలని స్థానికులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం విచారకరమని స్థానికులు తెలిపారు. అధికారులు స్పందించి మండల కేంద్రంలో వీధి దీపాలను పునరుద్ధరించాలని స్థానికులు కోరారు.


చీకటిలో సంచరిస్తున్న జనం

అరెస్టులపై వెల్లువెత్తిన నిరసనలు

నేడు విద్యా సంస్థల బంద్ ▸▸ ప్రజా సంఘాల నేతల పిలుపు


అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపడుతున్న ప్రజా సంఘం నేతలు

పాడేరులో ప్రజా సంఘాల నాయకుల రిలే దీక్షలను సోమవారం భగ్నం చేసి అరెస్టు చేయడంపై అల్లూరి జిల్లాలో పలు చోట్ల ఆందోళనలు చేపట్టారు. అధికారులు, పిఒ వైఖరిపై ప్రజా సంఘం నేతలు నిరసనలు చేశారు.

ప్రజాశక్తి-పాడేరు: పాడేరులో ప్రజా సంఘాల నాయకుల రిలే దీక్షలను సోమవారం భగ్నం చేసి అరెస్టు చేయడంపై మంగళవారం ప్రజా సంఘాల వేదిక ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ప్రజా సంఘాల నాయకులు పాలికి లక్కు, రాధాకృష్ణ తదితరులు అల్లూరి జిల్లాలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని నినాదాలు చేశారు. గిరిజన ఆశ్రమాల్లో సమస్యలు పరిష్కరించి, విద్యార్థుల మరణాలను అరికట్టాలని ఈనెల 1న బుధవారం తలపెట్టిన విద్యా సంస్థల బందును విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు అడ్మిషన్ ట్యూషన్ ఫీజులను ఐటిడిఏ ద్వారా చెల్లించాలన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్ అసిస్టెంట్లను నియమించి, విద్యార్థుల వరస మరణాలపై సిటింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్య వేదిక కో కన్వీనర్ ప్రభు దాస్, వేదిక నాయకులు నరేష్, చిన్నారావు, లతా కుమారి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లిలో ధర్నా

గిరిజన విద్యార్థుల సమస్యలు పరిష్కరించలేక శాంతియుతంగా దీక్షలు చేస్తున్న ప్రజా సంఘాల నేతలను పాడేరులో అరెస్టులు చేయించడం చాలా దుర్మార్గమని ఏపీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజయ్ ధ్వజమెత్తారు. ప్రజా సంఘాల నాయకుల అరెస్టులను ఖండిస్తూ చింతపల్లి మండల కేంద్రంలో మంగళవారం ఏపీ గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థి, ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులను పోలీసులతో ఐటిడిఏ పిఒ అక్రమంగా అరెస్టులు చేయించడం సిగ్గు చేటని హెద్దేవా చేశారు. ఐటిడిఏ పిఓను ప్రభుత్వం సరెండర్ చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ చింతపల్లి డివిజన్ కార్యదర్శి పాంగి జీవన్‌కుమార్, కార్తీక్, గిరిజన సంఘం నాయకులు కిల్లో సింహాచలం, మజ్జి రాంబాబు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు: ఈనెల 1న చేపట్టే గిరిజన సంక్షేమ ఆశ్రమ విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని మండల కేంద్రంలోని కళ్యాణ మండపంలో మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశాన్ని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.నరసయ్య ఎస్ఎఫ్ఐ, ప్రజాసంఘాల నాయకులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 43 రోజులుగా ఐటిడిఏ గేటు వద్ద శాంతియుతంగా నిరాహార దీక్ష చేపడుతున్న నాయకుల అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు కొర్ర డోంబ్రు, గిరిజన సంఘం మండల అధ్యక్షులు గల్లేల నారాయణ, కార్యదర్శి ఎం ఎం శ్రీను, సోలగం గాసిరం దొర, సిఐటియు మండల కార్యదర్శి కొర్ర శంకర్రావు, కిలో భీమన్న, సిపిఎం మండల కార్యదర్శి పాంగి భీమరాజు, లక్ష్మీపురం సర్పంచ్ కొర్రా త్రినాథ్, జర్రెల ఉపసర్పంచ్ వంతాల గణపతి, గిరిజన సంఘం మండల కమిటీ సభ్యులు రామ్మూర్తి, కృష్ణా, పవన్ కుమార్, పోతురాజు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: ప్రజాసంఘల నాయకులపై అక్రమ కేసులు బనాయించడాని తీవ్రంగా ఖండిస్తూ, బంద్‌ను జయప్రదం చేయాలని అరకువేలి ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యాన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల కళాశాలలో విస్తతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పి.సురెంద్ర, ఎస్ఎఫ్ఐ గర్ల్స్ కన్వీనర్ ఎస్.గంగమ్మ మాట్లాడుతూ, ఏజెన్సీ 11 మండలాల్లో ఈనెల 1న విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షురాలు కె ధనలక్ష్మి, మండల కమిటీ సభ్యులు ఎస్.సింగ్, ఎన్ పుష్ప పాల్గొన్నారు.


ముంచంగిపట్టులో మాట్లాడుతున్న నేతలు


హుకుంపేటలో చేపడుతున్న ఆందోళన

హుకుంపేట: దీక్షలు భగ్నం చేయడంపై గిరిజన సంఘం మండల కార్యదర్శి తాపుల కృష్ణారావు ఆధ్వర్యంలో గిరిజన ప్రజలతో స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఆశ్రమాల్లో తాగు నీరు, మరుగుదొడ్లు వంటి సమస్యలను పరిష్క రించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హుకుంపేట వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు, సిపిఎం మండల కార్యదర్శి, మాజీ సర్పంచ్ లక్ష్మణ్ రావు, గిరిజన సంఘం నాయకులు బాకూరు మోదకొండ రాజు, బాబూరావు, రాజారావు, కొర్ర రమేష్, సోకేలి మందన్న, నైని ఈశ్వర్‌రాజు, పాంగి మల్లేష్, ఎస్ మత్స్యరాజు, సోములు, గురుమూర్తి పాల్గొన్నారు.

జి.మాడుగుల: నాయకులను అరెస్టులు చేయడాన్ని గిరిజన సంఘం, సిఐటియు, ఎస్ఎఫ్ఐ నాయకులు ఖండించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సాగిన ధర్మన్నపడాల్ మాట్లాడుతూ, 43 రోజులుగా చేపడుతున్న దీక్ష శిబిరంను తొలగించి అరెస్టులు చేయడం సరికాదన్నారు.ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి జె.దీనబంధు, ఎస్ఎఫ్ఐ మండల నాయకులు భగీరథ, మల్లేష్, భాస్కర్‌లు పాల్గొన్నారు.

శిశు మరణాలపై స్పందించండి

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలో శిశు మరణాలపై సీరియస్ గా స్పందించాలని జిల్లా కలక్టర్ సుమిత్ కుమార్ వైద్యాధికారులను ఆదేశించారు. కలక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ, ఫిబ్రవరి ఒకటి నుండి శిశు మరణాలు సంభవిస్తే సంబంధిత వైద్యాధికారులు భాద్యత వహించాలని హెచ్చరించారు. అనవసరంగా జిల్లా ఆసుపత్రికి, కెజిహెచ్‌కు రిఫర్ చేయడాన్ని మానుకోవాలని, సహేతుకమైన కారణం లేకుండా రిఫర్ చేస్తే చర్యలు తప్పవన్నారు. రిఫర్ చేయడంతో సమయం వృధా అవుతుందని, ఈ తరలింపులో మరణానికి దారి తీసే అవకాశం కలుగుతుందని వెల్లడించారు. రిస్క్ భరించటానికి ఇష్టపడక భాద్యతల నుండి తప్పించుకోవటానికే రిఫర్ చేస్తున్నట్లుందని ఘాటుగా వ్యాఖ్యానించారు. పిల్లలకు తల్లిపాల ప్రాముఖ్యతపై కింది స్థాయి సిబ్బందికి అవగాహన కల్పించి, వైద్యాధికారులు ఎప్పటికప్పుడు గ్రామాలు సందర్శించి తగు సూచనలు ఇవ్వాలన్నారు. జిల్లా ఆసుపత్రిలో అవసరమైన పరికరాలు అమర్చడానికి చర్యలు తీసుకుంటామని, వాటిని సద్వినియోగం చేసి మరణాలు లేకుండా చూడాలని కోరారు. హై రిస్క్ గర్భిణీలు, శిశువులను పర్యవేక్షిస్తూ మరణాలు లేకుండా చూడాలని ఆదేశించారు. జిల్లా మాతా శిశు కేంద్రంలో రెండు నియో నాటల్ వెంటిలేటర్లు, ఆసుపత్రిలో ఆక్సిజన్ సరఫరా, ఆక్సిజన్ మాస్కులు, సెల్ కౌంటర్, కృత్రిమ పంపింగ్ కు సీపేప్ కొనుగోలు చేసి అందిస్తామన్నారు. కనీసం 50 ఆక్సిజన్ సిలండర్లు ఎప్పుడూ సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.ప్రభుత్వ ఆసుపత్రులలో అర్హత గల డాక్టర్లకు అవసరమైన శిక్షణలు ఇవ్వాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ, అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ, జిల్లా వైద్య ఆరోగ్యాధికారి జమాల్ బాషా, అదనపు జిల్లా వైద్యాధికారి లీలా ప్రసాద్, జిల్లా క్షయ నియంత్రణాధికారి పి.విశ్వేశరనాయుడు, జిల్లా ఆసుపత్రి పర్యవేక్షకులు శంకర్ ప్రసాద్, కృష్ణారావు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ప్రభావతి, పాడేరు, అరకు, చింతపల్లి ఏరియా ఆసుపత్రుల చిన్న పిల్లల వైద్య నిపుణులు తదితరులు పాల్గొన్నారు.


క్షతగాత్రులకు వైద్యం అందిస్తున్న దృశ్యం

లోయలోకి బోల్తా పడ్డ కారు

- ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- మారేడుమిల్లి

మారేడుమిల్లి- చింతూరు ఘాట్ రోడ్డులో కారు లోయలోకి బోల్తా పడి ముగ్గురికి గాయాలైన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.... విశాఖపట్నం నుండి వి.శ్రీనివాస్, అనూష దంపతులతో పాటు వారి బంధువైన యార్లగడ్డ నాగబాబు భద్రాచలం దైవ దర్శనానికి వెళ్లారు. దైవదర్శనం అనంతరం మంగళవారం తిరిగి చింతూరు మారేడుమిల్లి ఘాట్ రోడ్డు వారు వస్తుండగా, వారు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి లోయలో పడిపోయింది. దీంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. అటుగా ప్రయాణిస్తున్న కొందరు లారీ డ్రైవర్లు ప్రమాదాన్ని గమనించి లోయలో పడిన కారులో క్షతగాత్రులను మారేడుమిల్లి పిహెచ్‌సికి తరలించారు. పీహెచ్ సి వైద్యాధికారి డాక్టర్ హరికృష్ణ క్షతగాత్రులను పరీక్షించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి 108 అంబులెన్స్‌లో వారిని తరలించారు.

నైట్ హాల్ట్ బస్సును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరు నైట్ హార్ట్ బస్ సర్వీసును ఆర్టీసీ అధికారులు పునరుద్ధరించాలని ఎంపీటీసీ పిల్ల సాంబమూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అరకొర బస్ సర్వీసులతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు గురవుతున్నారని వాపోయారు. సీలేరు నైట్ హాల్ట్ బస్సు సర్వీస్ లేక సీలేరు, దుప్పిలివాడ, దారకొండ, సప్పర్ల పంచాయతీ మారుమూల ప్రాంతాల ప్రజలు అనేక ఇబ్బందులు గురవుతున్నారని తెలిపారు. దీనిపై ఆర్టీసీ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా బస్సులను పునరుద్ధరించడంలో జాప్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సాక్షాత్తు అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్‌కు, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మికి కూడా సీలేరు నైట్ హార్ట్ బస్ సర్వీసును పునద్ధరించాలని ప్రజలు విన్నవించారని, అయినా ఫలితం లేదన్నారు. సీలేరు నుంచి పాడేరు బస్సు సర్వీస్ ప్రతిరోజు రోజు తెల్లవారుజామున 5గంటలకు బయలుదేరి వయా చింతపల్లి మీదుగా పాడేరు వెళుతుందని, తర్వాత సీలేరు నుంచి మైదాన ప్రాంతానికి వెళ్లాలంటే 10 గంటల వరకు బస్సు సర్వీసు లేకపోవడంతో చుట్టుపక్కల ప్రయాణికులకు ఏం చేయాలో తెలీక నిస్సహాయ స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు చొరవ చూపాలని ఆయన కోరారు.


సీలేరులో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది, విద్యార్థులు

కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రతిజ్ఞ

ప్రజాశక్తి -సీలేరు

కుష్టి వ్యాధిని నిర్మూలిద్దామంటూ జికె.వీధి మండలం దారకొండ గ్రామ సర్పంచి నడిగట్ల రాజు, పిహెచ్‌సి వైద్యాధికారిణి హిమబిందు ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ మంగళవారం చేశారు. దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుష్టి వ్యాధి నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వంచారు. జాతీయ కుష్టి వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాజు, వైద్యాధికారి హిమబిందు మాట్లాడుతూ దేశాన్ని పోలియో, మశూచి రహిత దేశంగా చేయగలిగామని, కుష్టి వ్యాధి రహిత దేశంగా చేయాల్సిన అవసరం ఉందన్నారు. సాధారణంగా చర్మం రంగు కంటే కొంత తక్కువ రంగు లేదా రాగి రంగు ఉన్న స్పర్శ లేని మచ్చలు, నూనె పూసినట్టుగా నిగనిగలడే స్పర్శ లేని చర్మం ఉన్నట్లయితే ప్రాథమికంగా కుష్టి వ్యాధి ఉన్నట్లు నిర్ధారించుకోవచ్చునని తెలిపారు. కుష్టి వ్యాధికి సంబంధించి ఎలాంటి మూఢనమ్మకాలు అపోహాలు విశ్వసించవద్దని కుష్టి వ్యాధి పట్ల సమాజంలో అవగాహన పెంచడానికి జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్‌ఓ పోతురాజు, పిహెచ్‌ఎన్ రాణి, హెల్త్ అసిస్టెంట్ గోవిందు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన

హుకుంపేట : మండలంలోని కుష్టు వ్యాధి పై కొంతిలి గ్రామంలో మంగళవారం అవగాహన కల్పించారు. అనంతరం వైద్యాధికారి సుమన్న మాట్లాడుతూ, కుష్టు వ్యాధి లక్షణాలు బయట పడేందుకు రెండు నుండి ఐదు సంవత్సరాల వరకు పట్టవచ్చున్నారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారి గాయత్రి, స్వప్న, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కాఫీ రైతులకు బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన కాఫీ రైతులకు 2018 నుండి 2023 వరకు బకాయి సొమ్ము సుమారు రూ.60 కోట్లు ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని గిరిజన సంఘం మండల అధ్యక్షుడు గల్లెల నారాయణ డిమాండ్ చేశారు. మండల కేంద్రం లో గిరిజన సంఘం కార్యాలయం వద్ద మంగళవారం జిల్లా కమిటీ పిలుపుమేరకు మండల గిరిజన కాఫీ రైతులతో ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కొమ్మ పృథిరాజ్ మాట్లాడుతూ, కాఫీ రైతులకు కిలో ఫార్ట్యూన్మెంట్ రూ.500, కిలో చెర్రీ కాఫీకి రూ.300, మిరియాలుకు రూ.1000 గిట్టుబాటు ధరలు చెల్లించాలని కోరారు.కాఫీ రైతులకు ఉచితంగా బేబీ పుల్లింగ్ యూనిట్ ఇవ్వాలని, కాఫీ తోటల ప్రోత్సహకం నిధులు పెంచాలన్నారు. మార్కెటింగ్ సదుపాయాలు కల్పించి రైతులకు ఉచితంగా నిచ్చెనలు, కట్టర్లు, తార్పాల్లిన్‌లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి ఎంఎం శ్రీను, సొలగం గాసిరందొర, పాంగి భీమరాజు, కొర్ర శంకర్రావు, కిలో భీమన్న, కొర్ర డోంబ్రు, లక్ష్మీపురం సర్పంచ్ కొర్ర త్రినాథ్, జర్రెల ఉపసర్పంచ్ వంతల గణపతి, కాఫీ రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గిరిజన సంఘం నేత నారాయణ


విశాఖకు రాజధాని, సిఎం నివాసం మార్పుపై..

జగన్ ప్రకటన మోసపూరితం

ప్రజాశక్తి-పాడేరు- రాష్ట్ర రాజధానిని, ముఖ్యమంత్రి నివాసాన్ని వైజాగ్‌కు మారుస్తానని జగన్ మోహన్ రెడ్డి చేసిన ప్రకటన మోసపూరితమని సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. మూడు రాజధానులపై రాష్ట్ర ప్రభుత్వం చేసిన చట్టాన్ని ఉపసంహరించుకున్నారన్నారు. అమరావతి రాజధానిని అభివృద్ధి చేయాలని హైకోర్టు ఆదేశించిందని గుర్తు చేశారు. హైకోర్టు తీర్పును ఆపాలని రాష్ట్ర ప్రభుత్వం కోరినప్పటికీ సుప్రీం కోర్టు తిరస్కరించిందన్నారు. ఈ కేసు సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉందని, ముఖ్యమంత్రి ప్రకటన కోర్టు ధిక్కరణే అవుతుందన్నారు.ఈ పరిస్థితుల్లో ముఖ్యమంత్రి నివాసం మారినంత మాత్రాన ఒరిగేదేమీ ఉండదన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలను తప్పుదారి పట్టించడానికి, రియల్ ఎస్టేట్‌లో స్పెక్యులేషన్ పెంచడానికి ఇది తోడ్పడుతుందని పేర్కొన్నారు. విశాఖ ఉక్కు ను ప్రైవేట్ పరం చేస్తుంటే.. రాజధాని పేరుతో మోసం చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. అమరావతిని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-జి.మాడుగుల: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కొత్తూరు గ్రామంలో సిహెచ్, ఏపీఆర్ పాఠశాలల్లో మంగళవారం విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు ఆరోగ్య విస్తరణ అధికారి నడిగట్ల ప్రకాష్ స్థానిక విలేకరులకు తెలిపారు. పాఠశాలలో విద్యార్థులను పరీక్షించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థికి పరీక్షలు చేస్తున్న వైద్యులు

గిరిజనులకు సకాలంలో అందని సచివాలయ సేవలు

- సిబ్బంది నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ కరువుతో ఇబ్బందులు

- సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వాణిశ్రీ

ప్రజాశక్తి-మారేడుమిల్లి

సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గిరిజనులకు సచివాలయ సేవలు సకాలంలో అందడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు మట్ల వాణిశ్రీ అన్నారు. మండలంలోని వై.రామవరం మండలం, చింతలపూడి గ్రామ సచివాలయాన్ని సిపిఎం, గిరిజన సంఘం నాయకులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వాణిశ్రీ మాట్లాడుతూ ప్రమాదానికి గురైన భీములుగడ్డ గ్రామానికి చెందిన 8 సంవత్సరాల బాబుకి ఆపరేషన్ నిమిత్తం ఆరోగ్య శ్రీ కార్డులో పేరు నమోదు కొరకు చింతలపూడి గ్రామ సచివాలయం, ఐటిడిఎ చుట్టూ బాధితుడు తండ్రి కత్తుల లచ్చిరెడ్డి జనవరి-9 నుండి నేటి వరకు తిరుగుతున్నా సమస్య పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. సొంతంగా ఆపరేషన్ చేయించుకొనే ఆర్థిక స్థోమత లేదని, ఆపరేషన్ జరగక పోతే బాలుడు కాలు కుంటుపడే అవకాశం ఉందని పేర్కొన్నారు. వెంటనే ఆరోగ్య శ్రీలో పేరు నమోదు చేసి, ఆపరేషన్ జరిగేటట్లు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చింతలపూడి సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించకుండా నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని, దీని వల్ల అత్యవసర సేవలు పొందాల్సిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు సరైన సందర్శనలు చేయకపోవడం వల్ల సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇలాంటి సచివాలయ సిబ్బందిపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామ సచివాలయాలలో ఇంటర్నెట్ సౌకర్యం సరిగ్గా పనిచేయటం లేదని, రిపేర్ వస్తే 2 నుండి 3 వారాల పాటు ఇంటర్నెట్ లేక సచివాలయ ఉద్యోగులు సేవలు నిలిపివేస్తున్నారని తెలిపారు. సచివాలయ సిబ్బందికి కూడా మౌలిక వసతులు లేకపోవడం దారుణమన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సచివాలయాల్లో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఈతపల్లి సిరిమల్లి రెడ్డి, సీపీఎం మండల నాయకులు కత్తుల గంగిరెడ్డి, ఈతపల్లి ఆది రెడ్డి, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




- సిబ్బంది లేక ఖాళీగా ఉన్న చింతలపూడి గ్రామ సచివాలయం
- సచివాలయం వద్ద మాట్లాడుతున్న సిపిఎం, గిరిజన సంఘం నాయకులు

నేటితో ముగిసిన చాపరాయి టెండర్ గడువు

- స్థానికులకు ఉపాధి కల్పించాలి

- పలువురు నిరుద్యోగులు


చాపరాయి జలపాతం

ప్రజాశక్తి-దుంబ్రిగూడ

మండలంలో ప్రముఖ పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతం వద్ద పర్యాటకుల సౌకర్యార్థం అభివృది పనులు చేపట్టేందుకు గాను అధికారులు ప్రతి ఏడాది టెండర్ పాట నిర్వహిస్తున్నారు. పాట ద్వారా వచ్చిన నిధులతో చాపరాయి జలపాతంలో పర్యాటకుల సౌకర్యార్థం మరుగుదొడ్లు, వాడుకనీరు, తాగునీరుతో పాటు గార్డెన్ తో పాటు ఇతర సౌకర్యాలను అధికారులు కల్పిస్తున్నారు. గత ఏడాది పాడిన చాపరాయి టెండర్ పాట జనవరి 31తో ముగిసింది. ఈ ఏడాదికి సంబంధించి కొత్తగా మళ్లీ టెండర్ పాట నిర్వహించాల్సి ఉంది. పాట గడువు ముగింపునకు కొన్ని రోజుల ముందుగానే సంబంధిత రెవెన్యూ శాఖ అధికారులు టెండర్ పాట తేదీని ఖరారు చేస్తారు. ప్రస్తుతం టెండర్ గడువు ముగిసినప్పటికీ కొత్తగా అధికారులు పాట నిర్వహణకు చర్యలు తీసుకోకపోవడంతో ఏడాది టెండర్ పాట నిర్వహిస్తారా! లేక వదిలేస్తారా! అనే సందేహంలో స్థానికులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. టెండర్ పాట ద్వారా ఏడాదికి ప్రభుత్వానికి ఒకేసారి రూ.30 నుంచి రు.32 లక్షల వరకు సమకూరుతుంది. టెండర్ పాడిన నిర్వాహకులు కొంతమంది స్థానికులు గ్రూప్‌గా ఏర్పడి పాట పాడిన డబ్బులను ప్రభుత్వానికి చెల్లిస్తున్నారు. ఆ తర్వాత పర్యాటకుల నుంచి ప్రవేశ టికెట్లతో పాటు వాహనాల పార్కింగ్ టికెట్లను వసూలు చేసుకుంటూ ఉంటారు. ఈ విధంగా చేయడంతో కొంతమంది నిరుద్యోగ యువతకి ఉపాధి అవకాశాలు కూడా కలుగుతుంది. కాగా ఈ ఏడాది గడువు పూర్తిగా ముగిసినప్పటికీ కూడా టెండర్ పాట నిర్వహణకు అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో మండల వ్యాప్తంగా చర్చ జరుగుతుంది. ఈ టెండర్ పాట నిర్వహణ ప్రారంభంలో స్థానికంగా చదువుకొని ఖాళీగా ఉన్న నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో గత సుమారు 10 యేళ్ళ క్రితం అధికారులు దీనిని ప్రారంభించారు. ఇప్పటికి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించ లేదు. టెండర్ పాట పాడుకున్న నిర్వాహకులే వారికి అనుకూలమైన వారితో పార్కింగ్‌తో పాటు ప్రవేశ రుసుములను వసూలు చేసుకుంటున్నారు. ఆర్థికంగా వెనుకబడిన నిరుద్యోగ యువత టెండర్ పాటకు ముందుకు వెళ్లలేక పోతున్నారు. ఈ ఏడాదినుంచైనా స్థానిక పంచాయతీకి, స్థానికంగా సొసైటీ రిజిస్ట్రేషన్ నమోదు చేసుకొని ఉన్న సొసైటీ సంఘాలకు, స్థానిక గిరిజనులైన వారికి చాపరాయి జలపాతం నిర్వహణను అప్పగించాలని స్థానిక గిరిజనులు కోరుతున్నారు.


పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

3న యుటిఎఫ్ సంకల్ప దీక్ష

ప్రజాశక్తి- పాడేరు: ఉద్యోగులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు చేసి సిఎం జగన్ హామీ మేరకు పాత పెన్షన్ విధానం పునరుద్దరించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి. మహేష్ డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానం పునరుద్ధరణకై ఫిబ్రవరి 3న ధర్మస్థలిలో నిర్వహిస్తున్న సంకల్ప దీక్ష పోస్టర్లను కరపత్రాలను మంగళవారం పాడేరులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిఎం హామీ నెరవేర్చకపోగా గ్యారంటెడ్ పెన్షన్ విధానం ప్రతిపాదించడం సరికాదన్నారు. కొద్దిపాటి ప్రయోజనాలు అదనంగా చేసినప్పటికీ ఉద్యోగులకు పదవి విరమణ అనంతరం భద్రతా కలిగించేదిగా లేదన్నారు. ఆయా రాష్ట్రాలు పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాయన్నారు. ఫిబ్రవరి 3న ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కృష్ణాజిల్లా గన్నవరం సమీపంలో ధర్మస్థలి ప్రాంగణంలో సంకల్ప దీక్ష సభను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా సహాధ్యక్షులు నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి కే.రఘునాథ్, జిల్లా సిపిఎస్ కమిటీ కన్వీనర్ ఎల్.నారాయణ, ఆడిట్ కమిటీ కన్వీనర్ మెంబర్ ఎస్. కర్రి బాబు, జిల్లా కౌన్సిలర్ సోమెలి. శ్రీ రాములు, ఎస్. బాలకృష్ణ, దుక్కులు పాల్గొన్నారు.

సికిల్ సెల్ బాధితులకు మెరుగైన వైద్యం

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలో సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి మెరుగైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో హుకుంపేట మండలం మజ్జివలసలో నిర్వహించనున్న వైద్య అవగాహన శిభిరం ఏర్పాటుపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గాయత్రి విద్యా పరిషత్ ఆసుపత్రి అండ్ రిసెర్చ్ కేంద్రం సికిల్సెల్ వ్యాధి గ్రస్తులను గుర్తించి చికిత్స అందించటానికి ముందుకు రావడం, హుకుంపేట మండలాన్ని దత్తత తీసుకోవటం మంచి పరిణామమన్నారు. ముఖ్యంగా విద్యా శాఖ, గిరిజన సంక్షేమ శాఖాదికారుల సమన్వయంతో కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఇందుకు వైద్యాధికారులకు, పేరా మెడికల్ సిబ్బందికి అవసరమైన శిక్షణలు ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి రోణంకి గోపాలకృష్ణ, గాయత్రి విద్యాపరిషత్ ఆసుపత్రి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. రజని, అదనపు పర్యవేక్షకులు ప్రొఫెసర్ వి ధర్మారావు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరుటౌన్: ప్రముఖ పర్యాటక కేంద్రం చింతపల్లి మండలం లంబసింగి జంక్షన్లో ఐటిడిఏ అతిథి గృహం లీజుకు ఇవ్వడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఐటిడిఏ పిఒ రోణంకి గోపాలక్రిష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 2వ తేదీ నుండి 5వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తా మన్నారు. ఐటిడిఏ కార్యాలయంలో దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని ఆసక్తి కలిగిన చింతపల్లి మండలానికి చెందిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. గెస్ట్ హౌస్, క్యాంటీన్ నడుపుటకు చింతపల్లి మండలానికి చెందిన అభ్యర్థులను మాత్రమే నియమిస్తామని పేర్కొన్నారు. అతిథి గృహం, క్యాంటీన్ నిర్వహణకు ఏడాదికి రూ.6 లక్షలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తుదారులు చింతపల్లి మండల వాసులై 10వ తరగతి ఉత్తీర్ణులై 21 సంవత్సరాలు నిండి ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన గిరిజన యువత ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముగిసిన శారదా పీఠం వార్షికోత్సవం

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 97వ వార్డు పరిధి చినముసిడివాడలోని శారదా పీఠం వార్షికోత్సవం మంగళవారంతో ముగిసింది. రాజశ్యామల అమ్మవారి యాగం, పూర్ణాహుతి కార్యక్రమం చేపట్టారు. యాగ జలాలతో పీఠంలోని దేవతామూర్తుల విగ్రహాలకు స్వాత్మానందేంద్ర సంప్రోక్షణ చేశారు. రాజ్యశ్యామల అమ్మవారి యోగం పూర్ణాహుతిలో ఏపీ గవర్నర్ విశ్వ భూషణ్ హరిచందన్, టిటిడి చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ, కలెక్టర్ మల్లికార్జున్ పాల్గొన్నారు.

రైతులకు రూ.500 కోట్ల పంట రుణాలు

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: వచ్చే ఖరీఫ్ కాలంలో రైతులకు రూ.500 కోట్ల పంట రుణాలు అందించడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ స్పష్టం చేసారు. కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో బ్యాంకర్లు, చిన్న తరహా పరిశ్రమల ప్రోత్సాహక అభివృద్ధి సంస్థ, వ్యవసాయ శాఖ, డిఆర్డిఏ అధికారులతో 2022-23 ఆర్థిక సంవత్సర రుణ ప్రణాళికల అమలుపై మంగళవారం జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. వార్షిక రుణ ప్రణాళిక స్వల్ప కాలిక వ్యవసాయ, వ్యవసాయ టెర్మ్, వ్యవసాయానుబంధ రుణాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీకి రూ.447 కోట్ల రుణ లక్ష్యంగా నిర్దేశించగా రూ. 206 కోట్లు రుణాలు ఇచ్చారని, మిగిలిన రూ.231 కోట్ల రుణాలు అందించాలని స్పష్టం చేసారు. సూక్ష్మ పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి రుణాలు మంజూరు చేయాలని సూచించారు. ముద్రా రుణాలు, ప్రధాన మంత్రి ఉపాధి కల్పనా పథకం, ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమ బద్ధీకరణ, జగనన్న బడుగు వికాస పథకాలు నెల కొల్పడానికి రుణాలు అందజేయాలని చెప్పారు. స్వయం సహాయక సంఘాలకు పొదుపునకు మించి రుణాలు అందించాలన్నారు. మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ అందించాలని, రుణాల మంజూరులో జాప్యం చేయకూడదన్నారు. అనంతరం అటవీ హక్కు పత్రాలు పొందిన గిరిజన రైతులకు ది జిల్లా కేంద్ర సహకార బ్యాంకు రుణాలను పంపిణీ చేసారు. ఒక్కోక్క రైతుకు రూ.20 వేల చొప్పును 23 మంది రైతులకు రూ.4 లక్షల 60 వేల పంట రుణాలను అందించారు. రుణాలను సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బీమా పథకాలపై అవగాహన

ప్రభుత్వ బీమా పథకాలపై గిరిజనులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన కింద 18 నుండి 70 సంత్సరాల వయస్సు కలిగినవారు రూ.20ల బీమా ప్రీమియం చెల్లిస్తే రూ.2 లక్షల బీమా పరిహారం వస్తుందన్నారు. 18 నుండి 50 ఏళ్ల వయస్సు కలిగిన వారు ఏడాదికి రూ.346లు చెల్లించి ప్రధాన మంత్రి బీమా యోజన పథకంలో చేరితే రూ.2 లక్షల వ్యక్తిగత బీమా పరిహారం చెల్లిస్తారన్నారు. అటల్ పెన్షన్ యోజనలో నమోదు చేసుకున్న వారికి నెలకు వెయ్యి నుండి ఐదువేల వరకు పెన్షన్ పొందవచ్చని చెప్పారు.


రైతులకు పంట రుణాలు అందిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

పాడేరు శాసన సభ్యురాలు కె. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ,

జిల్లాలో పర్యాటక ప్రాంతాల స్వయం ఉపాధి పథకాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న స్వయం ఉపాధి పథకాలపై అవగాహ కల్పించాలన్నారు. స్వయం ఉపాధి పథకాలతో ఆర్థికాభివృద్ధి సాధించాలని శిక్షణ పొందిన గిరిజనులకు సూచించారు. పిఎంఇజిపి పథకంలో వ్యవస్థాపక అభివృద్ధి పై శిక్షణ పూర్తి చేసుకున్న 38 మందికి ధృవ పత్రాలు పంపిణీ చేసారు. ఈ సమావేశంలో ఐటిడిఏ పిఒ రోణంకి గోపాల క్రిష్ణ, యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ కె.నటరాజ్, ఎపిజివిబి ఆర్ఎం ఉదయ్ కిరణ్, ఎల్డిఎం రవితేజ్, మెప్మా పిఒ టి.శ్రీనివాసరావు, సిడ్బిసి ఇఓఎస్. జగన్నాధరాజు, డిసిసిబి సిఇఒ డివిఎస్ వర్మ, జిల్లా పరిశ్రమల కేంద్రం ఎడి ఎం.నవీన్ కుమార్, డి ఆర్డిఏ పిడి మురళి తదితరులు పాల్గొన్నారు.

బొడ్డెంగులకు గిరాకీ


మార్కెట్‌లో బొడ్డెంగుల విక్రయాలు

ప్రజాశక్తి -పాడేరు: పాడేరు మార్కెట్లో బొడ్డెంగులు(లైవ్) మంగళవారం ఆదివాసి యువకులు కొందరు అమ్మకాలు జరిపారు. పెదబయలు మండలం మారుమూల కుంతర్ల గ్రామ ప్రాంతంలోని అడవిలో కొందరు ఆదివాసి యువకులు వీటిని సేకరించి మార్కెటుకు తెచ్చి విక్రయించారు. పాడేరు మార్కెట్లో బొడ్డెంగల్ని అప్పుడప్పుడు విక్రయిస్తారు. ఇవి నిత్యం లభించవు. ఆదివాసి యువకులు అటవీ ప్రాంతంలో చాలా శ్రమటోర్చి వీటిని సేకరిస్తుంటారు. పాడేరు మార్కెట్‌కు వీటిని తెచ్చి విక్రయించడంతో చాలామంది కొనుక్కొని తీసుకువెళ్లారు. రూ.100లకు 30 బొడ్డెంగుల చొప్పున విక్రయించారు. బొడ్డెంగులు సేకరించిన తర్వాత ఒక పూట అంతా బతికే ఉంటాయని ఆ యువకులు తెలిపారు. బొడ్డెంగులు చాలా రుచిగా ఉంటాయని వీటిని ఆరగించిన వారు చెబుతుంటారు. ఇవి ఈత దుబ్బుల్లో లభిస్తుంటాయి. ఈత చెట్టు కాపు పూర్తయ్యాక చెట్టు ఎండిపోయి అంతరించే క్రమంలో ఈ బొడ్డెంగులు లభిస్తాయని ఆదివాసి యువకులు తెలిపారు.

పాడేరు ఏజెన్సీ ప్రాంతంలోని పెదబయలు, జి.మాడుగుల, ముంచంగిపుట్టు మండలాల పరిధిలోని అటవీ ప్రాంతాల్లో మాత్రమే ఈత చెట్ల పెంపకం ఉంది. అక్కడ మాత్రమే ఈ బొడెంగులు లభించే అవకాశం ఉంది. వీటిని సేకరించి అమ్మకాలు జరపడం చాలా తక్కువ. ప్రస్తుతం ఈ సీజన్లో రెండు మాసాలు ఈ బొడ్డెంగులు లభిస్తుంటాయి. బొడ్డెంగులు రక్తపుష్టిని కలగజేస్తాయి.ఎక్కువగా భోజనాలు, జీలుగ కల్లు, మద్యం తాగేవారు నంజుకుగా (స్టఫ్)గా, ఇళ్లకు బంధువులు వచ్చినప్పుడు బొడ్డెంగులుతో విందులు ఏర్పాటు చేస్తారు. రక్తహీనత ఉన్నవారు బొడ్డెంగులను వేపుడు, కూరగా తయారు చేసుకుని తింటే ఎంతగానో ఉపయోగపడుతుంది.ఇవి ఈత కాండం తింటూ పెరగడంతో కొవ్వు కలిగి ఉంటుంది. ఈ పురుగులను స్థానికులు వేయించుకుని తినడంతో పాటు కూరగా కూడా వండుకుంటారు. ప్రతి ఏటా సంక్రాంతికి ఈ పురుగులు లభించడంతో పండుగ చేసుకుంటారు

జి.మాడుగుల: ఏజెన్సీలో రొయ్యల సీజన్ వచ్చేసింది. ప్రతి ఏడాది జనవరి నుండి మార్చి వరకు మూడు నెలల పాటు బొడ్డింగులు లభిస్తాయి. వీటిని ఏజెన్సీ రొయ్యలు అని అంటారు. వీటిని లొట్ట లేసుకొని మరీ తింటారు. అవి మహా రుచి గా ఉంటాయని రైతులు చెబుతున్నారు.రైతులు వీటిని సేకరించి వారపు సంతకు అమ్మకానికి తీసుకు వస్తుంటారు. కిలో ఎనిమిది 800ల నుండి రూ.1000 వరకు ధర పలుకుతుంది. ఓ రైతు ఈ బోడ్డంగులను సేకరించి మంగళవారం జి మాడుగుల వారపు సంతకు తీసుకువచ్చాడు. తీసుకు వచ్చిన కొద్ది క్షణాల్లోనే అమ్ముడుపోయాయి.

నేరాలు ఘోరాలు

ద్విచక్ర వాహనం దగ్ధం

ప్రజాశక్తి - ఆరిలోవ : ముడసర్లోవ బిఆర్‌టిఎస్ రహదారిపై వెళ్తున్న ద్విచక్ర వాహనం నుంచి అకస్మాత్తుగా పొగలు వచ్చి మంటలు చెలరేగాయి. వాహనంపై ఉన్న ఇద్దరూ అప్రమత్తమై ప్రాణాలు దక్కించుకున్నారు. ఆరిలోవలోని ఒక బోరింగ్ కంపెనీకి చెందిన ఇద్దరు మంగళవారం ఉదయం హోండా యాక్టివా ద్విచక్ర వాహనంపై పైనాపిల్ కాలనీ వెళ్తున్నారు. రామకృష్ణాపురం చేరేసరికి వాహనం వెనుక భాగం నుంచి పొగలు రావడం గమనించారు. వెంటనే మంటలు కూడా చెలరేగడంతో వాహనాన్ని వదిలి దూరంగా పరుగులు తీశారు. వీరు కళ్ల ముందే వాహనం దగ్ధమైంది. ప్రయాణించిన ద్విచక్ర వాహనంలో పెట్రోల్, డీజిల్ వంటి ఇంధనాలు ఏవి తీసుకువెళ్లడం లేదని, వాహనంలో కూడా అర లీటరుకు మించి పెట్రోలు ఉండదని వాహన చోదకులు తెలిపారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఉంటాయని భావిస్తున్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి -మధురవాడ : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి సోమవారం రాత్రి మృతి చెందినట్లు సిఐ వై.రామకృష్ణ తెలిపారు. దీనికి సంబంధించి సిఐ కథనం ప్రకారం... నగరంలోని గురుద్వార్ ప్రాంతానికి చెందిన బెల్గాన జగదీశ్వరరావు (81) కారుషెడ్ కూడలి జాతర సమీపంలో రోడ్డు దాటుతుండగా ఆనందపురం నుంచి ఎండాడవైపు వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. అతడిని స్థానికులు 108 వాహనంలో నగరంలో ఆసుపత్రి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ జగదీశ్వరరావు మృతి చెందినట్లు సిఐ తెలిపారు. మృతుని కుమారుడు నారాయణరావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ విశ్వనాథం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆర్మీ ఉద్యోగి ఆత్మహత్య

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని లోడగలవానిపాలెం పంచాయతీ నేల్తేరు గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగి బంక సురేష్ (28) మంగళవారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. సురేష్ పంజాబ్‌లో విధులు నిర్వహిస్తూ సంక్రాంతి పండగ నిమిత్తం గ్రామానికి వచ్చాడు. సురేష్‌కు భార్య సంధ్య, ఏడాది పాప తన్వి ఉన్నారు. మంగళవారం ఉదయం నిద్రలేచి బయటకు వెళ్తానని సురేష్ భార్యతో చెప్పాడు. టిఫిన్ కోసం భార్య సంధ్య ఫోన్ చేసినా సురేష్ స్పందించలేదు. ఈగలవానిపాలెం సమీపంలోని ఎర్ర బందచెరువు పక్కన మృతి చెంది ఉండటాన్ని పలువురు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుని పక్కన పురుగుల మందు డబ్బా ఉన్నట్లు గుర్తించారు. భార్య సంధ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎఎస్ఐ సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకునికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక పోలీసు స్టేషన్ పరిధి మన్యాలపేట వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకునికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక అప్పికొండ వీధికి చెందిన అప్పికొండ రాజా (22) మధురవాడ బజాజ్ క్రెడిట్ కార్డు ఆఫీసులో పనిచేస్తున్నాడు. మోటారు బైక్‌పై మధురవాడ వెళ్తుండగా, ఎదురుగా వస్తున్న ప్రైవేట్ స్కూల్ బస్సు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం సమీపంలో ఉన్న అనిల్ నీరుకొండ ఆసుపత్రికి తరలించారు. హెడ్ కానిస్టేబుల్ వెంకటరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయులకు షోకాజు నోటీసు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇసుకతోట జివిఎంసి ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయిని కొండ, ప్రధానోపాధ్యాయలు జి.నాగమణికి జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ మంగళవారం షోకాజు నోటీసులు జారీ చేశారు. ఇసుకతోట జివిఎంసి ప్రాథమిక పాఠశాలను డిఇఒ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల వర్క్‌బుక్స్‌ను తనిఖీ చేశారు. ఏడు నెలలుగా దిద్దకపోవడాన్ని గమనించారు. ఇటీవల పాఠశాలను సందర్శించిన జిల్లా విద్యాశిక్షణా సంస్థ ప్రిన్సిపల్, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వర్క్‌బుక్స్ దిద్దకపోవడాన్ని గమినించి తక్షణమే వాటిని దిద్దాలని సూచించి వెళ్లారు. అయినా ఆ పని చేయకపోవడంతో తరగతి ఉపాధ్యాయిని కొండ, ప్రధానోపాధ్యాయులు నాగమణిపై ఆగ్రహం వ్యక్తం చేసి షోకాజు నోటీసులు జారీచేశారు.

విశాఖలో రైటర్ చిత్ర యూనిట్ సందడి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : లైబ్రరీలో పని చేసే ఒక మధ్య తరగతి యువకుడు రచయిత అవ్వాలనుకోడమే 'రైటర్' చిత్ర కథ అని ఆ చిత్ర కథానాయకుడు సుహాస్ తెలిపారు. చాయ్ బిస్కెట్ ఫిల్మ్స్ పతాకంపై నిర్మించిన రైటర్ చిత్ర యూనిట్ మంగళవారం నగరంలోని ఒక హోటల్ లో మీడియా సమావేశం ఏర్పాటు చేసింది. కథానాయకుడు సుహాస్ మాట్లాడుతూ రైటర్ సినిమా ఈ నెల 3న విడుదల అవుతుందన్నారు. విజయవాడ, గుంటూరు, కాకినాడ, భీమవరం, విశాఖ ప్రాంతాల్లో ప్రీమియర్ షోలకు మంచి స్పందన వస్తోందన్నారు. కలర్ ఫోటో సినిమా నచ్చిన వాళ్లకు ఈ సినిమా కూడా నచ్చుతుందన్నారు. హీరోయిన్ టీనా శిల్పరాజ్ మాట్లాడుతూ ఇది తన తొలి సినిమా అన్నారు. ఈ చిత్రంతో తనకు మంచి గుర్తింపు వస్తుందన్నారు. హీరోయిన్ గౌరీ ప్రియ మాట్లాడుతూ ఇది మంచి కథా చిత్రమని, వినోదాత్మకంగా వుంటుందని అన్నారు. నిర్మాతలు అనురాగ్ రెడ్డి, శరత్ చంద్ర మాట్లాడుతూ కుటుంబ సమేతంగా చూసే సినిమా ఇది అన్నారు. రోహిణి, ఆశిష్ విద్యార్థి వంటి సీనియర్ నటులు ఇందులో వున్నారని తెలిపారు. దర్శకుడు షణ్ముఖ ప్రశాంత్ మాట్లాడుతూ కొత్త నటీనటులతో సినిమా తీసామని చెప్పారు. లహరి మ్యూజిక్ సంస్థ ద్వారా ఆడియో విడుదల చేస్తున్నామన్నారు. అనంతరం ఐనాక్స్ థియేటర్‌లో ప్రీమియర్ షో ప్రదర్శించారు.



దీక్షా శిబిరంలో నినదిస్తున్న పెన్షనర్లు

స్టీల్‌ప్లాంట్‌తోనే విశాఖ భవిష్యత్తు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేట్‌పరం కాకుండా ఉంటే విశాఖ నగర భవిష్యత్తుకు డోకా ఉండదని, ఒకవేళ ప్రైవేటుపరమైతే నగరానికి తీవ్ర నష్టం కలుగుతుందని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.హుస్సేన్ అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు మంగళవారం నాటికి 670వ రోజుకు చేరాయి. దీక్షల్లో అసోసియేషన్ నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి మినహా అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, ఆంధ్రప్రదేశ్ ప్రజానీకం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నాయని చెప్పారు. ఈ విషయాన్ని గుర్తించకుండా కేంద్రంలోని బిజెపి స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయాలని నిర్ణయించడం, ఆ దిశగా అన్ని ఏర్పాట్లు చేస్తుండడం దుర్మార్గమన్నారు. దేశంలో మిగిలిన స్టీల్ ప్లాంట్లకూ, విశాఖ స్టీల్ ప్లాంట్‌కూ ఎంతో వ్యత్యాసం ఉందన్నారు. ఎన్నో పోరాటాలు, త్యాగాల ఫలితంగా స్టీల్‌ప్లాంట్ విశాఖలో ఏర్పాటైందన్నారు. లాభాల్లో నడుస్తున్న ప్రభుత్వ రంగ స్టీల్ ప్లాంట్ ఇదొక్కటేనన్నారు. దీనిని ప్రైవేట్‌పరం చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని, ఎంతటి త్యాగానికైనా సిద్ధపడతామని స్పష్టం చేశారు. దీక్షల్లో పాల్గొన్న వారిలో వై.అప్పారావు, రమణ, రాంప్రభు, సిఎన్.రావు, డి.విజ్ఞానంద్, ప్రొఫెసర్ ఎస్.సూరప్పడు, వి.తులసీరామ్, కెఎం.కుమార మంగళం ఉన్నారు.

ఇపిడిసిఎల్ డైరెక్టర్‌గా రమేష్‌ప్రసాద్ కొనసాగింపు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఎపిఇపిడిసిఎల్) ఆపరేషన్స్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న బి.రమేష్‌ప్రసాద్ ఉద్యోగ కాలాన్ని మరో ఏడాదిపాటు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. 2020 నుంచి డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన సేవలను గుర్తించి వచ్చే ఏడాది జనవరి వరకు కొనసాగిస్తూ నిర్ణయం తీసుకుంది. డైరెక్టర్‌గా పదవీకాలం పెంచడంతో రమేష్‌ప్రసాద్‌ను సంస్థ అధికారులు, ఉద్యోగులు, యూనియన్ నాయకులు అభినందించారు.

సౌత్ కోస్ట్ రైలుకు పునాదిరాయి పడేనా..?

- వాల్తేరు రైలు ప్రాజెక్టులు మళ్లీ పెండింగేనా ?
- పోలవరం ఊసు ఉంటుందా ?
- ఉద్యోగులకు ఊరటనిచ్చే పన్నుల మినహాయింపు లభించేనా ?
- కేంద్ర బడ్జెట్ నేపథ్యంలో ఊరిస్తున్న ఆశలు



విశాఖ రైల్వే స్టేషన్ (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

కేంద్ర బడ్జెట్ 2023-24పై విశాఖ ప్రాంత ప్రజానీకంలో ఆసక్తి నెలకొంది. ఎన్నో ఆశలు వారిని ఊరిస్తున్నాయి. కేంద్రంలోని బిజెపి సర్కారు బుధవారం పార్లమెంట్‌లో ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ పెట్టబోతున్న సంగతి తెలిసిందే. ప్రధానంగా ఈ ప్రాంతానికి కేంద్రం నూతన రైల్వే జోన్‌ను ప్రకటించింది. సౌత్ కోస్ట్ రైల్వే జోన్ అంటూ మూడేళ్లుగా హడావుడి చేసిందే తప్ప పునాది రాయి కూడా పడలేదు. ఇంకా ప్రారంభోత్సవం సంగతి కేంద్ర పాలకులకే తెలియాలి. విశాఖ కేంద్రంగా ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్‌డి) అధికారిని కూడా 2017లోనే దక్షిణ కోస్తా రైల్వే జోన్ పనుల నిర్వహణకు కేటాయించినా పైసా పని జరగలేదు. మరో వైపు దేశంలోనే అధిక ఆదాయార్జన తెచ్చే డివిజన్‌లలో ఒకటైన వాల్తేరు రైల్వే డివిజన్‌ను బిజెపి సర్కారు అనాలోచితంగా ఎత్తేసి ఈ ప్రాంతానికి అన్యాయం చేసింది. డివిజన్ లేని రైల్వే జోన్ అంటే 'తల లేని మొండెం'తో సమానమంటూ సిపిఎం, వామపక్షాలు ఆందోళనలు చేసినా మోడీ సర్కారు కనీస స్థాయిలో దీనిపై పునరాలోచన చేయలేదంటే ఈ ప్రాంత అభివృద్ధిని కుంటుపరచాలనే వ్యూహం తప్ప మరొకటి లేదు. మరో వైపు పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి జాతీయ ప్రాజెక్టుగా గుర్తించినా ఆ దిశగా నిధుల కేటాయింపు, పనులు జరగడం లేదు. ఇది పూర్తయితే విశాఖ నగరానికి తాగునీటి సమస్య తీరనుంది. పోలవరం ప్రాజెక్టుకు బడ్జెట్ ఆమోదంపైనా కేంద్రం సరైన నిర్ణయం, విధానం తీసుకోకపోవడం ఒక పెద్ద వైఫల్యంగానే చెప్పొచ్చు.

అతీగతి లేని రైల్వే లైన్ ప్రాజెక్టులు

ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్ష అయినటువంటి విశాఖ కేంద్రంగా నూతన రైల్వే జోన్‌ను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నాన్చుతూనే వస్తోంది. ఈ బడ్జెట్‌లోనైనా పనుల కోసం నిధులు కేటాయించి ఫౌండేషన్ స్టోన్ పడుతుందా ? అన్న అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. వాల్తేరు రైల్వే పరిధిలోని నౌపాడ-గుణుపూర్ లైన్ ఉంది. గుణుపూర్ నుంచి తెరుబలి వరకూ కొత్తగా ట్రాక్ (లైన్ పనులు) జరగాల్సి ఉంది. దీనికోసం రూ.1500 కోట్లు అంచనా వేశారు. ఈ బడ్జెట్‌లో వస్తాయని రైల్వే అధికారులు ఆశగా ఎదురు చూస్తున్నారు. జైపూర్-మల్కన్‌గిరి, అలాగే మల్కన్‌గిరి-భద్రాచలం ఒక లైన్ పెండింగులో ఉంది. కేంద్రం ప్రకటన చేసినా పనుల కోసం ఒక్కపైసా రాలేదు. విజయనగరం- టిట్లాగర్ 3వ లైన్‌కి నిధులు రూ.2500 కోట్లు అవసరం. పనులు నడుస్తున్నాయి. సుమారు 360 కిలోమీటర్ల లైన్ పనుల కోసం పై నిధుల ప్రతిపాదనను ఈ కేంద్ర బడ్జెట్ స్వీకరిస్తుందా ? అన్నది చూడాల్సిందే.

స్కీం వర్కర్ల సమస్యలు

మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీ వర్కర్లకు జీతాలు రూ.10 వేలు లేదా రూ.11 వేలు దాటడం లేదు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్న డిమాండ్ దేశ వ్యాపితంగా ఉంది. స్కీం వర్కర్ల తరపున సిఐటియు పోరాడుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో కనీస వేతనానికి కేంద్ర బడ్జెట్‌లో పాలకులు చర్యలు చేపడతారా ? లేదా ? అన్నది చూడాల్సిందే.

ప్రత్యక్ష పన్నుల భారం తగ్గేనా..

ఇటీవల కాలంలో దేశంలోని కోట్ల మంది ఉద్యోగుల జీత, భత్యాల అంశం చర్చనీయాంశమైంది. వీరికి జిఎస్‌టి, ఆదాయ పన్నుల భారం లేకుండా ఉంటే మార్కెట్‌లోకి అదనంగా డబ్బు పారుతుందన్నది దీని సారాంశం. కేంద్రం ఏమైనా కనికరిస్తుందా? చూడాల్సిందే. అంతేగాక ప్రపంచం తాజాగా ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభం తాకిడి మన దేశానికి తగలకుండా ఉండాలంటే ఆదాయపు పన్ను పరిమితిని పెంపుదల చేయడం, రియల్ ఎస్టేట్, హౌసింగ్ రంగంలో పన్నులు తగ్గించడం చేస్తే.. ఉద్యోగుల ఖర్చు వీటిపై చేస్తారని, మౌలిక వసతుల రంగం, యువతకు ఉపాధి కూడా తద్వారా పెరుగుతుందనే చర్చ దేశంలో జరుగుతోంది. కేంద్ర ప్రభుత్వం ప్రధానంగా డైరెక్ట్ ట్యాక్స్‌ల భారాన్ని తగ్గిస్తుందని ఉద్యోగులంతా ఎదురు చూస్తున్నారు. ఉదాహరణకు ఒక ఉద్యోగికి రూ.15 వేలు మేర ఒక నెలకు పన్నులు తగ్గితే ఇదంతా మార్కెట్‌లోకి వచ్చి ఇతర రంగాల అభివృద్ధికి తోడ్పడుతుందన్న ప్రచారం జరుగుతోంది. లేదంటే ఒక నెల జీతాన్ని ఏటా పన్నుల భారంగా మోయాల్సి వస్తుందని, దీనివల్ల మార్కెట్ అభివృద్ధి జరగదన్నది తెలుస్తోంది.

ఎంవిపి రైతు బజార్‌పై నీలినీడలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

ఉదయం లేచింది మొదలు ఉరుకుల, పరుగుల జీవితం. రోజు మొత్తం ఒత్తిడితోనే మనకు తెలియకుండా గడిపేస్తున్నాం. ఇంత ఒత్తిడిలో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు తాజా కూరగాయలు, ఆకుకూరలు ఎంతో అవసరం. వాటిని అందించేవే రైతు బజార్లు, అందులో నగరంలోని ఎంవిపి.రైతు బజారు ముఖ్యమైనది. ఎక్కడెక్కడివారో ఇక్కడకు వస్తారు. తాజాగా ఇక్కడి రైతు బజార్‌పై నీలినీడలు అలుముకున్నాయి. రైతు బజారును తరలిస్తారని, రైతులను వేరే బజారుకు మారుస్తారనే వార్త పట్ల అందరూ ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా డ్వాక్రా మహిళలు ఇక్కడే వంటా వార్పు చేసుకుంటూ గిరి శిఖర గ్రామాల నుండి గిరిజన ఉత్పత్తులను సేకరించి ఇక్కడే అమ్మకాలు చేస్తూ జీవిస్తున్నారు. వారూ ఆందోళనకు గురవుతున్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా 1800 రైతు కుటుంబాలు ఈ రైతు బజారుపై ఆధారపడి జీవిస్తున్నాయి. అధికారులు, ప్రభుత్వం ఏం ఆశించి ఇంతటి నష్టం కలిగించే నిర్ణయాలు తీసుకుంటున్నారో అర్థం కావట్లేదని పలువురు వాపోతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక ఇప్పటికే చాలా నష్టపోతున్నామని, రైతు బజారు మూసేస్తే తమ పొట్టగొట్టినట్లేనని పలువురు 'ప్రజాశక్తి' ఎదుట వాపోయారు. తామేదో ఈ రైతు బజార్లలో సరుకులు అమ్మి పెద్ద మొత్తంలో డబ్బు సంపాదించి గుత్తేదారులుగా మారిపోయినట్లుగా కొన్ని పత్రికలు అదే పనిగా రాయడం, వాటిని అధికారులు గుడ్డిగా అనుసరించడం పరిపాటిగా మారిపోయినట్టు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



జివిఎంసి వద్ద ఆందోళనకు దిగిన సిపిఎం, సిపిఐ నేతలు

పూర్ణా మార్కెట్, ముడసర్లోవ ప్రయివేటుకొద్దు

- ప్రతిపాదన విరమించుకోవాలని జివిఎంసి వద్ద సిపిఎం, సిపిఐ ఆందోళన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పిపిపి పేరుతో పూర్ణామార్కెట్, ముడసర్లోవ భూములను వైసిపి అనుయాయులకు అప్పగించే ప్రతిపాదనలను తక్షణమే విరమించుకోవాలని సిపిఎం, సిపిఐ జివిఎంసి పాలకవర్గాన్ని డిమాండ్ చేశాయి. బుధవారం జరిగే జివిఎంసి కౌన్సిల్ సమావేశంలో వైసిపి పాలకవర్గ నిర్ణయాలను అన్ని రాజకీయపార్టీల కార్పొరేటర్లు ముక్తకంఠంతో వ్యతిరేకించి, ప్రభుత్వ, ప్రజల ఆస్తులను కాపాడాలని కార్పొరేటర్లకు సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు ఎం.జగ్గునాయుడు, ఎం.పైడిరాజులు విజ్ఞప్తి చేశారు. ప్రజల ఆస్తులను పిపిపి పేర ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టే చర్యలు వెనుక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే జివిఎంసి పరిధిలో ఉండే విలువైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవడానికి వైసిపి అగ్రనాయకులు తీవ్ర ప్రయత్నాలు చేశారన్నారు. ఇంకా మిగిలి ఉన్న జివిఎంసి ఆస్తులను పిపిపి పేరుతో వైసిపి ప్రభుత్వ పెద్దలు కాజేయాలని కుట్రపన్నారన్నారు. అందులో భాగంగానే నేడు సర్దార్ వల్లభాయ్ పటేల్ (పూర్ణామార్కెట్), ముడసర్లోవ పార్కుల 283 ఎకరాల భూములను పిపిపి కింద ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వాలని కౌన్సిల్‌లో అజెండా పెట్టి తీర్మానం చేయబోతున్నారన్నారు. దీనిని తక్షణమే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ప్రజా సమూహంలోకి వెళ్లి పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఇప్పటికే యూజర్ ఛార్జీల పేరుతో ప్రజలపై అన్యాయంగా వేసిన చెత్త, ఆస్తి పన్నులు రద్దు చేయాలని కోరారు. జి-20 దేశాల గ్లోబల్ సమ్మిట్ పనులకు జివిఎంసి నుంచి రూ.100 కోట్ల నిధులు కేటాయించే ప్రతిపాదనలను విరమించాలన్నారు. విశాఖ ప్రజల అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరారు. ముడసర్లోవ ప్రాంతంలోని జివిఎంసి స్థలం 283.02 ఎకరాలు సుమారు రూ.5 వేల కోట్లు విలువైనదన్నారు. ఆధునీకరణకు రూ.50 కోట్లు వెచ్చించి, చుట్టూ ప్రహరీగోడ నిర్మాణానికి రూ.15 కోట్లు జివిఎంసి నిధులు ఖర్చు చేస్తున్నారన్నారు. అభివృద్ధి పేరుతో ప్రజల ఆస్తిని దోచిపెట్టడం తప్ప మరొకటి కాదన్నారు. ప్రఖ్యాతిగాంచిన పూర్ణామార్కెట్‌లో జివిఎంసి లెక్కలు ప్రకారమే సుమారు 430 పర్మినెంటు దుకాణాలు, 200 తాత్కాలిక దుకాణాలు ఉన్నాయన్నారు. చిరు వ్యాపారులు సుమారు 650 మంది వున్నారన్నారు. 1.35 ఎకరాల విస్తీర్ణంలో ఈ మార్కెట్ వుందన్నారు. పిపిపి మోడల్‌లో దీనిని అభివృద్ధి చేస్తామని ప్రతిపాదనలు చేసారని, దీని వల్ల వందల మందికి ఉపాధి పోతుందని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్‌కె.రెహ్మాన్, పి.చంద్రశేఖర్, జి.రాంబాబు, సిపిఎం, సిపిఐ నాయకులు బి.జగన్, ఎం.సుబ్బారావు, పి.మణి, బి.వెంకటరావు, ఎస్.మురళి, ఎంఎ.బేగం, ఎ.దేముడమ్మ, జి.జయ పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యాన..

పూర్ణా మార్కెట్, ముడసర్లోవ పార్కులను వైసిపి నాయకుల పరం కాకుండా కాపాడుకుంటామని టిడిపి విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, పార్లమెంట్ నియోజవర్గం సమన్వయకర్త ఎం.శ్రీ భరత్ అన్నారు.

సుజల స్రవంతి భూసేకరణ అధికారిగా రమామణి

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

బాబూ జగ్జీవన్‌రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి భూ సేకరణ అధికారిగా కె.రమామణి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారిని కలిసి తరువాత ఆర్‌డిఒ కార్యాలయంపైనున్న తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు.